

# హోలీ రోజున అమానుషం

**రంగు చల్లాడని నాలుగేళ్ల మనవడిపై వేడి నీళ్లు పోసిన నాన్నమ్మ**

**నాగపూర్‌లో ఘటన.. నిందితురాలిపై కేసు**

**ప్రజానావ, ముంబై:** దేశవ్యాప్తంగా రంగుల పండుగ హోలీ సంబరాలు కొనసాగుతున్న వేళ మహారాష్ట్రలోని నాగపూర్‌లో అమానుష ఘటన చోటుచేసుకుంది. తనపై రంగు చల్లాడన్న కోపంతో ఒక నాన్నమ్మ నాలుగేళ్ల మనవడిపై మరుగుతున్న వేడి నీళ్లు పోసిన ఘటన తీవ్ర సంచలనం రేపింది. ఈ ఘటనలో బాలుడికి సుమారు 45 శాతం కాలిన గాయాలు కాగా ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. నాగపూర్ జిల్లా కోరాడి ప్రాంతంలోని ఆరామ్ షీన్‌లో ఈ సంఘటన జరిగింది. ఘటనకు సంబంధించిన దృశ్యాలు స్థానిక సీసీటీవీ కెమెరాలో రికార్డు కావడంతో ఈ వార్త వేగంగా వ్యాపించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓమ్ అనే నాలుగేళ్ల బాలుడు తన ఇంటి బయట రంగులు నింపిన పిచికారితో ఆడుకుంటున్నాడు. అదే సమయంలో అతడి నాన్నమ్మ సింధు థాకరే కట్టెల పొయ్యిపై కాచిన నీటితో బకెట్ పట్టుకుని వెళుతోంది. ఇంతలో బాలుడు పిచికారితో ఆమెపై రంగు నీళ్లు జల్లాడు. దీంతో ఆగ్రహానికి లోనైన సింధు థాకరే తన చేతిలో ఉన్న మరుగుతున్న నీటిని బాలుడిపై పోసింది. దాంతో తీవ్రంగా కాలిన గాయాలతో ఆ బాలుడు విలవిలలాడుతూ కింద పడిపోయాడు. అక్కడే ఉన్న మరో మహిళ వెంటనే స్పందించి చిన్నారిపై చల్లని నీళ్లు పోసి ఉపశమనం కలిగించే ప్రయత్నం చేసింది. అనంతరం నిందితురాలు కూడా బాలుడిపై చల్లని నీళ్లు పోసిన దృశ్యాలు వీడియోలో కనిపిస్తున్నాయి. ఈ ఘటనలో బాలుడి నడుము కింది భాగంలో తీవ్ర గాయాలు అయ్యాయి. సుమారు 45 శాతం మేర శరీరం కాలిపోవడంతో బాలుడిని నాగపూర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై నిందితురాలు సింధు థాకరేపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# మరణం తర్వాత కూడా గౌరవ హక్కు కొనసాగుతుంది

**హిందూ శ్మశానవాటికలో ఖననం చేసిన ముస్లిం వ్యక్తి మృతదేహాన్ని తీయాలని బాంబే హైకోర్టు ఆదేశం**

**కుటుంబానికి అప్పగించి అంత్యక్రియలు చేయాలని సూచన**



**ప్రజానావ, ముంబై:** మరణం తర్వాత కూడా గౌరవంగా జీవించే రాజ్యాంగ హక్కు కొనసాగుతుందని బాంబే హైకోర్టు స్పష్టం చేసింది. నాగ్‌పూర్‌లోని హిందూ శ్మశానవాటికలో పొరపాటున ఖననం చేసిన ముస్లిం వ్యక్తి మృతదేహాన్ని బయటకు తీసి కుటుంబ సభ్యులకు అప్పగించాలని కోర్టు ఆదేశించింది. మరణించిన తర్వాత కూడా ప్రతి వ్యక్తికి గౌరవంగా అంత్యక్రియలు నిర్వహించుకునే హక్కు ఉందని కోర్టు పేర్కొంది. ఈ మేరకు అధికారుల పాత నిర్ణయాన్ని బాంబే హైకోర్టు నాగ్‌పూర్ బెంచ్ రద్దు చేస్తూ మృతదేహాన్ని వెలికితీసి కుటుంబానికి అప్పగించాలని ఆదేశించింది.

**అసలు కేసు ఏమిటి?**

నాగ్‌పూర్‌లో సాజిద్ ఖాన్ అనే వ్యక్తి రైలు ప్రమాదంలో మరణించాడు. మొదట్లో అతన్ని ఎవరూ గుర్తించకపోవడంతో పోలీసులు అతన్ని 'అజ్ఞాత వ్యక్తి'గా భావించారు. దీంతో నాగ్‌పూర్‌లోని మోక్షధామ్ ఘాట్‌లో ఉన్న హిందూ శ్మశానవాటికలో హిందూ సంప్రదాయాల ప్రకారం అతని మృతదేహాన్ని ఖననం చేశారు. తరువాత సాజిద్ సోదరుడు జావిద్ ఖాన్ పోలీసులను సంప్రదించి ఫోటోల ఆధారంగా తన సోదరుడి మృతదేహాన్ని గుర్తించాడు. తన సోదరుడికి ముస్లిం సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించేందుకు 'బడా తాజ్ బాగ్' సమాధి స్థలానికి మృతదేహాన్ని తరలించేందుకు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వ అధికారులను కోరాడు. అయితే తహసీల్దార్, సబ్‌డివిజనల్ అధికారులు ఈ అభ్యర్థనను తిరస్కరించారు. దీనిపై జావిద్ ఖాన్ హైకోర్టును ఆశ్రయించగా, జస్టిస్ అనిల్ కిలోర్, జస్టిస్ రాజ్ వాకోడ్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం గౌరవ హక్కు జీవించి ఉన్న వ్యక్తికే కాకుండా మరణం తర్వాత కూడా కొనసాగుతుందని కోర్టు పేర్కొంది. ప్రతి వ్యక్తికి తన మత సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించుకునే హక్కు ఉందని స్పష్టం చేస్తూ, మృతదేహాన్ని వెలికితీసి కుటుంబ సభ్యులకు అప్పగించాలని కోర్టు ఆదేశించింది.

# సిరిసిల్ల జిల్లాలో సీఐల బదిలీలు

**సిరిసిల్ల టౌన్ సీఐగా నెమ్మని శ్రీనివాస్, ఎల్లారెడ్డిపేటకు ఓదెల వెంకటేశ్**




**ప్రజానావ, సిరిసిల్ల:** రాజన్న సిరిసిల్ల జిల్లాలో పలువురు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. జోన్--1 పరిధిలోని ఎనిమిది మంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఎస్. చంద్రశేఖర్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. కామారెడ్డి సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న నెమ్మని శ్రీనివాస్‌ను సిరిసిల్ల పట్టణ సీఐగా బదిలీ చేశారు. ప్రస్తుతం సిరిసిల్ల టౌన్ సీఐగా పనిచేస్తున్న కస్పరాజు కృష్ణను హైదరాబాద్ ఐజీపీ కార్యాలయం జోన్--1కు రిపోర్టు చేయాలని ఆదేశించారు. జిల్లా డీసీఆర్‌బీలో విధులు నిర్వహిస్తున్న కదిర నాగేశ్వరరావును సిరిసిల్ల రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు. సిరిసిల్ల రూరల్ సీఐగా ఉన్న మొగిలిని డీసీఆర్‌బీకి బదిలీ చేశారు. అదేవిధంగా కరీంనగర్ పీసీఆర్‌లో పనిచేస్తున్న ఓదెల వెంకటేశ్‌ను ఎల్లారెడ్డిపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# 15న సిరిసిల్లలో బీఎస్పీ బహిరంగ సభ

- 5వేల మందితో నిర్వహణకు సన్నాహాలు
- పార్టీ బలోపేతం కోసం ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థుల ఎంపికపై చర్చ
- నేడు పార్టీ శ్రేణుల సన్నాహక సమావేశం




**ప్రజానావ, సిరిసిల్ల:** బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) వ్యవస్థాపక అధ్యక్షుడు కాన్షీరాం జయంతిని పురస్కరించుకొని ఈ నెల 15న సిరిసిల్లలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎలగందుల వెంకన్న, జిల్లా అధ్యక్షుడు కొమ్మెట అశోక్ తెలిపారు. గురువారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, కాన్షీరాం జయంతి సందర్భంగా సుమారు 5వేల మంది పాల్గొనేలా భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఇందుకు సంబంధించి ఈ నెల 6వ తేదీ శుక్రవారం సిరిసిల్ల రెండో బైపాస్‌లోని కామాక్షి బ్యాంకెట్ హాల్‌లో సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రానున్న ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ బలోపేతం కోసం చర్యలు చేపడుతున్నామని, అలాగే అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ కూడా చేపడతామని తెలిపారు. ఈ సమావేశానికి జిల్లాలోని బీఎస్పీ నాయకులు, ముఖ్యకార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రం శేఖర్, జోనల్ చీఫ్ కోఆర్డినేటర్ నిషాని రామచంద్రం, పార్లమెంటుకు సంబంధించిన రాష్ట్ర స్థాయి నాయకులు, జిల్లా అధ్యక్షులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎలగందుల వెంకన్న మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. కాన్షీరాం చూపిన బాటలో నడిచి బహుజన రాజ్యాన్ని సాధించుకోవడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాలకు చెందిన బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బీఎస్పీ నాయకులు లింగంపల్లి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు, విద్యార్థినులు భయపడొద్దు

- ధైర్యంగా ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం
- సిరిసిల్ల ఎస్పీ మహేశ్ బీ గితే
- ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో యాక్ట్, లైంగిక వేధింపులపై అవగాహన కార్యక్రమాలు



**ప్రజానావ, సిరిసిల్ల:** విద్యార్థినులు, మహిళలు వేధింపులకు గురైనప్పుడు భయపడకుండా ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ మహేశ్ బీ గితే సూచించారు. ఫిర్యాదు అందిన వెంటనే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు. జిల్లాలో షీ టీమ్ బృందం విద్యాసంస్థలు, మహిళలు పనిచేసే ప్రదేశాల్లో ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో చట్టం, మహిళల రక్షణ చట్టాలు తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి నెలలో షీ టీమ్‌కు వచ్చిన ఫిర్యాదులపై 4 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడంతో పాటు 6 పెట్టి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. మహిళలు, విద్యార్థినులను వేధిస్తున్న వారిని గుర్తించి వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళలు, విద్యార్థినులు ఎక్కడైనా అభద్రత భావానికి గురైతే భయపడకుండా వెంటనే షీ టీమ్‌ను సంప్రదించాలని సూచించారు. జిల్లాలో మహిళలు, విద్యార్థినుల రక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని, ముఖ్యంగా సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయం అయ్యే వ్యక్తులతో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ పంచుకోవద్దని హెచ్చరించారు. మహిళలు పనిచేసే ప్రదేశాల్లో లేదా విద్యాసంస్థల్లో లైంగిక వేధింపులు, ర్యాగింగ్ వంటి ఘటనలు ఎదురైనా మౌనంగా ఉండకుండా ధైర్యంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎవరైనా ఆకతాయిలు మహిళలు, యువతులను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యాసంస్థల్లో వేధింపులు జరిగినా, రోడ్డుపై వెళ్తున్నప్పుడు అవహేళనగా మాట్లాడినా, ఉద్దేశపూర్వకంగా వెంబడించినా వెంటనే జిల్లా షీ టీమ్ నంబర్ 8712656425కు ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.

# త్వరగా ఇందిరమ్మ ఇండ్లు పూర్తిచేయాలి

- గృహ ప్రవేశానికి సిద్ధం చేయాలి
- కలెక్టర్ గరిమ అగ్రవాల్
- సిరిసిల్లలో పలు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పరిశీలన



**ప్రజానావ, సిరిసిల్ల :** ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు సాధ్యమైనంత త్వరగా నిర్మాణాలు పూర్తి చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని నాలుగో వార్డులో ఎలిగేటి రూపిక, కొండబత్తిని పందరి, కొయ్యాడ మానస ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుంటుండగా.. కలెక్టర్ గరిమ అగ్రవాల్ గురువారం పరిశీలించారు. ఇందిరమ్మ ఇల్లు ఎప్పుడు మొదలు పెట్టారో ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులు ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, త్వరితగతిన ఇళ్లు పూర్తి చేసుకోవాలని పిలుపు నిచ్చారు. గృహ ప్రవేశానికి సిద్ధం చేయాలని సూచించారు. హౌసింగ్. మున్సిపల్ అధికారులు ఇండ్ల నిర్మాణాల ఫొటోలు ఎప్పటికప్పుడు ఆన్లైన్ లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ సాజిద్, తహసీల్దార్ మహేశ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

**ఇంటర్ పరీక్ష కేంద్రం తనిఖీ**

ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకస్మిక తనిఖీ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్ పరీక్ష కేంద్రంలో కలెక్టర్ తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, కనీస వసతుల కల్పనను పరిశీలించి, అధికారులతో మాట్లాడారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ మహేశ్ కుమార్, అధ్యాపకులు, సిబ్బంది ఉన్నారు.

# ఖమేనీ మరణంతో పూణేలో హై అలర్ట్

**భద్రత కట్టుదిట్టం చేసిన పోలీసులు**

**నగరంలో వేలాది ఇరానియన్ విద్యార్థులు**

**షియా సమాజం సంతాప సమావేశాలు**

**సున్నిత ప్రాంతాల్లో నిఘా పెంపు**



**ప్రజానావ, ముంబై:** అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు పశ్చిమాసియాలో తారాస్థాయికి చేరుకున్న నేపథ్యంలో మహారాష్ట్రలోని పూణే నగరంలో పోలీసులు హై అలర్ట్ ప్రకటించారు. ఇరాన్ నాయకుడు, షియా మతాధికారి ఆయతుల్లా ఖమేనీ మరణంతో ప్రపంచ రాజకీయాల్లో ప్రకంపనలు నెలకొన్నాయి. ఈ పరిస్థితుల దృష్ట్యా నగరంలో భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేశారు. పూణే నగరంలో వేలాది మంది ఇరానియన్ విద్యార్థులు చదువుల కోసం నివసిస్తున్నారు. ముఖ్యంగా కోండ్వా, క్యాంప్, ఖడక్ వంటి ప్రాంతాల్లో ఇరానియన్ పౌరులు ఎక్కువగా ఉన్నారు. అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావం స్థానిక శాంతిభద్రతలపై పడకుండా ఉండేందుకు పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. పోలీసులు గస్తీని పెంచడమే కాకుండా ఇరానియన్ విద్యార్థులు, పౌరులతో నేరుగా మాట్లాడి పరిస్థితులను సమీక్షించారు. వీసా గడువు ముగిసిన వారి విషయంపై కూడా అధికారులు స్పందించారు. అత్యవసర పరిస్థితుల్లో వీసా గడువు పొడిగింపుపై అధికార యంత్రాంగం సానుకూలంగా స్పందిస్తున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా ఖమేనీ మరణానికి ప్రతిస్పందనగా కోండ్వా, ఖడక్ ప్రాంతాల్లో షియా సమాజానికి చెందిన ప్రజలు సంతాప సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. పరిస్థితి అదుపు తప్పకుండా ఉండేందుకు పోలీసులు సున్నితమైన మతపరమైన ప్రదేశాల వద్ద నిఘాను పెంచినట్లు తెలిపారు.




## 7న సిరిసిల్లలో నూతన న్యాయస్థాన భవన శంకుస్థాపన

**హాజరు కానున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏకే సింగ్**

**ప్రజానావ, సిరిసిల్ల:** జిల్లా కేంద్రంలో నూతన న్యాయస్థాన భవన సముదాయ నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నారు. పెరుగుతున్న జనాభా, న్యాయ సేవల అవసరాలను దృష్టిలో పెట్టుకుని నిర్మించనున్న ఈ భవనానికి ఈ నెల 7వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు శంకుస్థాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. నీరజ తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, హైకోర్టు న్యాయమూర్తి మరియు జిల్లా కోర్టు పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ ఎన్. తుకారాంజి ముఖ్య అతిథులుగా హాజరవుతారని వెల్లడించారు. అదేవిధంగా జస్టిస్ పి. శ్యామ్ కోసి, జస్టిస్ కె. లక్ష్మణ్, జస్టిస్ విజయ సేన్ రెడ్డి, జస్టిస్ వేణుగోపాల్, జస్టిస్ పుల్లా కార్తీక్, జస్టిస్ జె. శ్రీనివాస్ రావు, జస్టిస్ నందికొండ నర్సింగరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొననున్నట్లు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జూపల్లి శ్రీనివాసరావు తెలిపారు. జిల్లాలోని అధికార, అనధికార ప్రముఖులు, న్యాయవాదులు, న్యాయస్థాన సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## లివర్ సమస్యతో బాధపడుతున్న చిన్నారికి ఆర్థిక సాయం

**రూ.10 వేలు అందించిన 26వ వార్డు కౌన్సిలర్ నెల్లుట్ల నరేశ్**



**ప్రజానావ, సిరిసిల్ల:** సిరిసిల్ల పట్టణంలో లివర్ సమస్యతో బాధపడుతున్న చిన్నారికి స్థానిక 26వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ నెల్లుట్ల నరేశ్ రూ.10 వేల ఆర్థిక సహాయం అందించి ఆదుకున్నారు. సిరిసిల్ల పట్టణంలోని 34వ వార్డు వైస్ చైర్మన్ దార్ల సందీప్ ద్వారా తెలిసిన సమాచారం మేరకు, వారి వార్డులో నివాసం ఉంటున్న అంబటి వేణు కుమార్తె సహస్ర (10) లివర్ సమస్యతో బాధపడుతోంది. ప్రస్తుతం ఆమె హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని రెయిన్‌బో ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. వైద్యులు ఆమెకు తక్షణం లివర్ ఆపరేషన్ అవసరమని సూచించారు. ఈ విషయం తెలుసుకున్న 26వ వార్డు కౌన్సిలర్ నెల్లుట్ల నరేశ్ స్పందించి, ఆపరేషన్ కోసం ఎమ్మెల్యే కల్వకుంట్ల రామారావుకు విషయాన్ని తెలియజేసి తన వంతుగా రూ.10,000 ఆర్థిక సహాయం అందించారు. అంతేకాకుండా నరేష్ మిత్రులు కూడా గూగుల్ పే, ఫోన్ పే ద్వారా సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో నెల్లుట్ల నరేశ్ యువసేన టీమ్ సభ్యులు నెల్లుట్ల వేణు, ఎండీ ముజీబ్, నెల్లుట్ల శ్రీకాంత్, వెంకటేశ్, ఫయాజ్ భాయ్, నాయీమ్, షాదబ్, అన్నారపు తేజ, నెల్లుట్ల రాహుల్, అరుణ్, రాకేశ్, వెంకటేశ్, రమేశ్, విలసాగరం శ్రీనివాస్, మద్దికుంట శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా పాఠశాలల ప్రవేశాల పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్



**ప్రజానావ, సిరిసిల్ల:** క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ గరిమ అగ్రవాల్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం ఆవిష్కరించారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ తెలంగాణా రాష్ట్రం లోని వివిధ క్రీడల పాఠశాలలు హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్ రీజనల్ స్పోర్ట్స్ స్కూల్‌లో 2026-27 విద్యా సంవత్సరంలో 4వ తరగతిలో ఆసక్తి గల బాలబాలికలు ప్రవేశానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్మన్‌కు సన్మానం



**ప్రజానావ, బిచ్కుంద:** కామారెడ్డి జిల్లా బిచ్కుంద మున్సిపల్ చైర్మన్ సీమ షెట్కార్, వైస్ చైర్మన్ భాగ్యలక్ష్మిలను గురువారం టీఎన్జీవో యూనియన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి శాలువాలు కప్పి ఘనంగా సన్మానం చేశారు. అంగన్వాడీలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో యూనియన్ ప్రాజెక్టు సెక్రటరీ విజయలక్ష్మి, జాయింట్ సెక్రటరీ ప్రమీల పాల్గొన్నారు. వీరితో పాటు అంగన్వాడి టీచర్లు రాణి, సంతోషి, సావిత్రి, వీణ, రాజమణి తదితరులు హాజరయ్యారు.

# దేశాభివృద్ధిలో విద్యార్థులు భాగస్వాములు కావాలి




- ఎస్‌యూ ఎంఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. ఈ. మనోహర్
- మార్చి 9న సిరిసిల్లలో జిల్లా స్థాయి వికసిత భారత్ యూత్ పార్లమెంట్ పోటీలు
- 'ఎమర్జెన్సీ-భారత ప్రజాస్వామ్యానికి పాఠాలు' అంశంపై ప్రసంగాలు

**ప్రజానావ, సిరిసిల్ల:** విద్యార్థులు దేశాభివృద్ధిలో చురుగ్గా పాలుపంచుకోవాలని, తమ అభిప్రాయాలను నిర్భయంగా వెల్లడించాలని శాతవాహన విశ్వవిద్యాలయం ఎంఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మనోహర్ పిలుపునిచ్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోఆర్డినేటర్‌గా ఉన్న డాక్టర్ ఈ. మనోహర్, డాక్టర్ డి. విజయ్ కుమార్‌లు జిల్లా స్థాయి యూత్ పార్లమెంట్ పోటీలకు సంబంధించి కళాశాల విద్యార్థులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ అభిప్రాయాలను నిస్సంకోచంగా, నిర్భయంగా వ్యక్తపరిచి జాతి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. సిరిసిల్లలోని వికాస్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో మార్చి 9, 2026న వికసిత భారత్ యూత్ పార్లమెంట్ జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనాలని కోరుతూ గురువారం సిరిసిల్ల జిల్లాలోని డిగ్రీ, ఇంజనీరింగ్, నర్సింగ్ కళాశాలల్లో విస్తృత ప్రచారం చేపట్టారు. '50 ఏళ్ల ఎమర్జెన్సీ -- భారతదేశ ప్రజాస్వామ్యానికి ఇచ్చే పాఠాలు' అనే అంశంపై పోటీలు నిర్ణయించినట్లు తెలిపారు. విద్యార్థులు మూడు నిమిషాల పాటు ఈ అంశంపై ఉపన్యాసం ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. ఇందులో ఐదుగురిని విజేతలుగా ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తారని, తదుపరి గరిష్టంగా ముగ్గురికి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం లభిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో మేరా భారత్ జిల్లా అధికారి ఎం. వెంకట రాంబాబు, ఎస్ఆర్ఆర్ గవర్నమెంట్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ అధ్యాపకురాలు బి. ఎలిజబెత్ రాణి, ఇతర అధ్యాపకులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

# నిబంధనలు తప్పక పాటించాల్సిందే

- లాడ్జీల్లో బసచేసే అతిథుల వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలి
- సీసీ కెమెరాల రికార్డింగ్స్‌ను నిర్దిష్ట కాలం వరకు భద్రంగా ఉంచాలి
- 18 ఏళ్లలోపు మైనర్లకు గదులు అద్దెకు ఇవ్వొద్దు
- వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్




**ప్రజానావ, వేములవాడ:** లాడ్జీల నిర్వాహకులు నిబంధనలను కచ్చితంగా పాటించి తీరాలని వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ సూచించారు. వేములవాడలోని లాడ్జీల్లో ఇటీవల చోటు చేసుకుంటున్న వరుస సంఘటనల నేపథ్యంలో లాడ్జీల నిర్వహణపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మేరకు గురువారం లాడ్జీల నిర్వాహకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి లాడ్జీలో బస చేసే అతిథుల పూర్తి వివరాలను రిజిస్టర్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని, ఆధార్ కార్డు లేదా ఇతర గుర్తింపు పత్రాలను పరిశీలించడమే కాకుండా వాటి ప్రతులను భద్రపరచాలని సూచించారు. భద్రతా దృష్ట్యా లాడ్జ్ ప్రాంగణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, రికార్డింగ్స్‌ను నిర్దిష్ట కాలం వరకు భద్రంగా ఉంచాలని సూచించారు. 18ఏళ్ల లోపు మైనర్లకు తల్లిదండ్రులు లేదా చట్టబద్ధ సంరక్షకులు లేకుండా గదులు ఇవ్వకూడదని స్పష్టం చేశారు. లాడ్జి గదులు, ప్రాంగణంలో మద్యపానం పూర్తిగా నిషేధించాల్సిందిగా ఆదేశించారు. నిబంధనలు, నిషేధాలు, పోలీసు సూచనలకు సంబంధించిన బోర్డులను స్పష్టంగా ప్రదర్శించాలని తెలిపారు. పోలీసుల సూచనలు, చట్టపరమైన నిబంధనలు ఎవరైనా ఉల్లంఘించినట్లయితే సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని వేములవాడ టౌన్ ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు. ప్రజల భద్రత కోసం లాడ్జ్ నిర్వాహకులు పూర్తిగా సహకరించాలని కోరారు.

# పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీను వినియోగించుకోండి




- మూడు కిలోవాట్ల సోలార్ ప్లాంట్‌కు రూ.78 వేల సబ్సిడీ
- విద్యుత్ బిల్లులో నెలకు రూ.2వేల వరకు ఆదా
- కలెక్టర్ గరిమ అగ్రవాల్
- జిల్లాలో అవగాహన కోసం ప్రచార రథం ప్రారంభం

**ప్రజానావ, సిరిసిల్ల:** పీఎం-సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం పీఎం-సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన ప్రచార రథాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజులపాటు టీఎస్ రెడ్‌కో ఆధ్వర్యంలో ప్రజలకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి విద్యుత్ వినియోగదారుడు తమ ఇళ్ల రూఫ్‌టాప్‌లపై సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకుని విద్యుత్ బిల్లులను తగ్గించుకోవడంతో పాటు కార్బన్ ఉద్గారాలను జీరో స్థాయికి తీసుకురావాలని సూచించారు. జిల్లాలోని అన్ని మండలాలు, సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల పరిధిలో ఈ పథకం గురించి విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులకు ఆదేశించారు. మూడు కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ పలకలను ఏర్పాటు చేసుకుంటే కేంద్ర ప్రభుత్వం రూ.78 వేల సబ్సిడీ అందిస్తుందని తెలిపారు. దీంతో ప్రతినెలా సుమారు రూ.2 వేల వరకు విద్యుత్ బిల్లులో ఆదా చేయవచ్చని చెప్పారు. సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసిన పెట్టుబడి ఆరేళ్లలో తిరిగి వస్తుందని పేర్కొన్నారు. సోలార్ విద్యుత్ పర్యావరణ హితమని, మిగులు విద్యుత్‌ను గ్రిడ్‌కు అందజేసి అదనపు ఆదాయం కూడా పొందే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. ప్రజలు ఈ పథకాన్ని విస్తృతంగా వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెస్ ఎండీ భిక్షపతి, డీఈ అంజయ్య, డీఓ మునీందర్ రెడ్డి, ఏడీఓ లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ముంబైలో షాకింగ్ ఘటన

- గర్భం దాల్చిన మైనర్ బాలిక
- అశ్లీల వీడియోలు చూపించి తమ్ముడితో సంబంధం పెట్టుకున్నట్లు అంగీకారం
- కేసు నమోదు చేసిన పోలీసులు

**ప్రజానావ, ముంబై:** ముంబైలోని మలాడ్ తూర్పు ప్రాంతంలోని కురార్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక షాకింగ్ ఘటన వెలుగులోకి వచ్చింది. 16 ఏళ్ల మైనర్ బాలిక తన 13 ఏళ్ల తమ్ముడికి అశ్లీల వీడియోలు చూపించి, అతనితో లైంగిక సంబంధం పెట్టుకున్నట్లు పోలీసుల దర్యాప్తులో బయటపడింది. బాలిక గర్భవతి కావడంతో ఈ విషయం బయటపడింది. కడుపు నొప్పితో బాధపడుతున్న బాలికను తల్లిదండ్రులు ఆసుపత్రికి తీసుకెళ్లగా వైద్యులు సోనోగ్రఫీ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో ఆమె గర్భవతి అని తేలడంతో ఆసుపత్రి యాజమాన్యం వెంటనే కురార్ పోలీసులకు సమాచారం ఇచ్చింది. పోలీసులు బాలికను, ఆమె తమ్ముడిని విచారించగా అసలు విషయం బయటపడింది. ఇంట్లో ఒకే చిన్న గదిలో కుటుంబ సభ్యులు నివసిస్తున్నారని, తల్లిదండ్రులు మంచంపై పడుకునేవారని, తాను మరియు తన అక్క నేలపై పడుకునేవారని బాలుడు పోలీసులకు తెలిపాడు. అందరూ నిద్రపోయిన తర్వాత తన అక్క మొబైల్‌లో అశ్లీల వీడియోలు చూపించి, ఆ తర్వాత తనతో లైంగిక చర్యలకు పాల్పడేదని చెప్పాడు. ఇది దాదాపు ఒక సంవత్సరం నుంచి కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ విషయాన్ని ఎవరికి చెప్పినా చంపేస్తానని తన అక్క బెదిరించేదని బాలుడు తెలిపినట్లు సమాచారం. కురార్ పోలీస్ స్టేషన్ సీనియర్ పోలీస్ ఇన్స్పెక్టర్ ప్రకాష్ వసంత్ వేల్ మాట్లాడుతూ, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. బాలిక గర్భవతి కావడంతో కుటుంబ సభ్యుల అనుమతితో చట్టపరమైన ప్రక్రియ పూర్తిచేసి గర్భస్రావం చేయించినట్లు చెప్పారు. అనంతరం డీఎన్ఏ పరీక్షలు నిర్వహించనున్నట్లు పోలీసులు తెలిపారు.



